జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
శుక్రవారం, ఫిబ్రవరి 23, 2024 పేజీలు 07



# సిరిసిల్ల డిఎస్పీగా భీమ్ శర్మ బాధ్యతలు

సిరిసిల్ల, ఫిబ్రవరి 22, (ప్రజాజ్యోతి): సిరిసిల్ల డిఎస్పీగా భీమ్ శర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డిఎస్పీగా విధులు నిర్వర్తించిన ఉదయ్ రెడ్డి హైదరాబాద్ సైబర్ సెల్ కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్బంగా నూతన డీఎస్పీ భీమ్ శర్మకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## ముదురుతున్న ఎండలు..

# అడుగంటుతున్న భూగర్భ జలాలు


**పశువులకు మేతగా మారిన వరి పొలాలు**

**ఇబ్బందులు పడుతున్న మెట్ట ప్రాంత రైతులు**

**గత ప్రభుత్వం రైతులను గౌరవెల్లి ప్రాజెక్టు పేరు చెప్పి మోసం చేసింది**

**కాల్వల నిర్మాణం కాకముందే నీళ్లు ఎలా ఇస్తారు..?**

చిగురుమామిడి: ఫిబ్రవరి22 (ప్రజా జ్యోతి) ప్రస్తుతం వేసవికాలం ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. దీంతో మెట్ట ప్రాంతమైన చిగురుమామిడి మండలంలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఇక్కడి రైతులు ఎక్కువ శాతం బావులు, బోరుబావులపైనే అదారపడి పంటలను సాగు చేస్తున్నారు.ప్రస్తుతం బావుల్లో నీరు అడుగంటడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఆరుగాలం కష్టపడి వేసిన పొలాలు తమ కళ్ళముందే ఎండుతుండడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పోయిన వర్షాకాలంలో చెరువులు, కుంటలు నిండి మత్తళ్లు దూకాయి. దీంతో రైతులు వరి సాగు వైపు మొగ్గు చూపారు. అయితే ఫిబ్రవరి లోనే ఎండలు ముదిరి తీవ్రరూపం దాల్చడంతో వ్యవసాయ బావులు, బోరు బావుల్లోని నీరు అడుగంటి పోతోంది. దీంతో తాము పంట పొలాలకు సరిగా నీరు అందించలేకపోతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి వేసిన పంటలను మిగతా 2లో..






## ఓటు హక్కును వినియోగంపై

# అవగాహన కల్పించాలి

**కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్, ఫిబ్రవరి 22, (ప్రజా జ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, వయోజనులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ కలెక్టర్ ఆడిటోరియంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా మెంటర్స్ అండ్ క్యాంపస్ అంబాసిడర్లకు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాలల్లో తోటి విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించాలని చెప్పారు. ఓటు హక్కు నమోదు, వినియోగంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం తరపున సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఈ సర్టిఫికెట్లతో ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రతి ఇంటికి ఓటరు స్లిప్పులు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో అందరూ ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నారని, ఇది దురదృష్టకరమని తెలిపారు. ఓటింగ్ శాతం కూడా పెరిగేలా అధికారులు మిగతా 2లో..

## భూ సమస్యల

# పరిష్కారానికి సిద్ధంగా ఉండాలి

**కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



పెద్దపల్లి ప్రతినిధి, ( ప్రజా జ్యోతి), , ఫిబ్రవరి -22: జిల్లాలో ఉన్న భూ సమస్యల సంపూర్ణ సమాచారంతో పాటు, భూ సమస్యల పరిష్కారానికి ధరణిలో చేయాల్సిన చేర్పులు, మార్పులు, చట్టాల సవరణ, మొదలగు వాటిపై ఇవ్వాల్సిన నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంభందిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తన క్యాంపు కార్యాలయంలో భూసమస్యల పరిష్కారానికి ధరణి కమిటీ సమావేశానికి అందించాల్సిన నివేదిక రూపకల్పనపై అదనపు కలెక్టర్ లు జే.అరుణశ్రీ, జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ లతో మిగతా 2లో..



# గిరిజన అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**సంత్ సేవాలాల్ కు ఆది శ్రీనివాస్ నివాళి**

వేములవాడ, ఫిబ్రవరి 22, (ప్రజాజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో గురువారం సంత్ సేవాలాల్ 285 జయంతి ఉత్సవాల్లో ఆది శ్రీనివాస్ పాల్గొని, సంత్ సేవాలాల్ కు పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ప్రజలందరికీ సంతు సేవాలాల్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సంతు సేవాలాల్ గిరిజనుల అభివృద్ధి కోసం మహారాజ్ మిగతా 2లో..

### ఓటు హక్కును వినియోగంపై
## అవగాహన కల్పించాలి



మొదటిపేజీ తరువాయి..
చూడాలని సూచించారు. యువతతోనే సమాజంలో మార్పు వస్తుందని, అన్ని అంశాల్లో ప్రజలను చైతన్యవంతులను చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యత, వివిధ అంశాలపై పలు కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు మాట్లాడారు. క్విజ్ పోటీలతోపాటు పలు అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా పిడి రవీందర్, మైనింగ్ శాఖ ఏడి రామాచారి, ఎన్ వై కే కోఆర్డినేటర్ రాంబాబు వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజన అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట



మొదటిపేజీ తరువాయి..
ఎంతో కృషి చేశారని, సంతు సేవాలాల్ జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అన్నారు. గిరిజన ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. గిరిజనులు సంత్ సేవాలాల్ ఆశయాలను కొనసాగించాలని, సమాజంలో ఒక ఆధ్యాత్మిక వేత్తగా, సాంఘిక దురాచారాలు రూపుమాపేందుకు ఎంతో కృషి చేశారన్నారు. బ్రిటిష్ పరిపాలనపై పోరాటం చేస్తూ దేశ స్వతంత్రానికి తన వంతు పాత్ర పోషించారని అన్నారు. గిరిజన జాతికి మార్గదర్శిగా జాతి కోసం సేవ చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. సంతు సేవాలాల్ మహారాజ్ ఆలోచన విధానాన్ని స్వీకరించి, వారి అడుగుజాడల్లో ముందుకు నడవాలని పేర్కొన్నారు. గిరిజనులకు పోడు భూముల పట్టాల విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.





# అడుగంటుతున్న భూగర్భ జలాలు

మొదటిపేజీ తరువాయి..
దక్కించుకోవాలన్న తపనతో కొందరు రైతులు వ్యవసాయ బావుల్లో పూడిక తీస్తున్నారు. అయినప్పటికీ నీరు సరిగా అందక పంటలు ఎండుతున్నాయి. దీంతో చేసేదేమిలేక ఎండిన పంట పొలాల్లో పశువులను మేపుతున్నారు. చిగురుమామిడి మండలంలోని లంబాడిపల్లి గ్రామానికి చెందిన కాసిడి ప్రశాంత్ రెడ్డి, కాటం సంజీవరెడ్డి, చందబోయిన సంపత్ యాదవ్, జంగ రమణారెడ్డి, జెట్టి కుమారస్వామి, మచ్చగాని సాయిలు,ఆది శ్రీకాంత్,ఆది తిరుపతి, నందికొండ బాపిరెడ్డి, ఆది మంజులకు చెందిన వరిపైరు నీరందక ఎండిపోతుందని కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి రైతుల కష్టాలు తీర్చాలని, ఎండిపోయిన పంటలను సర్వే చేపించి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

**గత ప్రభుత్వం రైతులను మోసం చేసింది**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టులో ట్రయల్ రన్ పేరిట రైతులను మోసం చేసిందని ఇక్కడి రైతులు ఆరోపిస్తున్నారు. గౌరవెల్లి ప్రాజెక్టులో నీటిని నింపి పంట పొలాలకు నీరు అందిస్తుందని ఆశతో పంటలు వేశామన్నారు. అయితే చిగురుమామిడి మండలానికి గౌరవెల్లి ప్రాజెక్టు నుండి ఇప్పటి వరకు కాలువల నిర్మాణమే జరగలేదని, అలాంటప్పుడు ఇక్కడి భూములకు నీరు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. గడచిన తొమ్మిదిన్నర సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను అనేక విధాలుగా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గౌరవెల్లి ప్రాజెక్టును కుర్చీ వేసుకుని కట్టిస్తానని, రైతులను నమ్మబలికి రెండోసారి అధికారంలోకి వచ్చాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపి గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం త్వరగా పూర్తి చేసి, మెట్టప్రాంత రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి సిద్దంగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి..
కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, జిల్లాలో భూ సమస్యలపై ధరణి, ప్రజావాణి ద్వారా వస్తున్న దరఖాస్తులు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధరణిలో అందుబాటులో ఉన్న మాడ్యుల్స్ లో వచ్చిన దరఖాస్తులు, వాటిపరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. భూ సమస్యల పరిష్కారానికి ధరణి కమిటీ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించనుందని,ఇందుకోసం మండలాల వారీగా పెండింగ్ ధరణి దరఖాస్తులు, ప్రస్తుత పరిస్థితి, పెండింగ్ ఉండడానికి గల కారణాలతో కూడిన నివేదిక తయారు చేసి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. భూ సమస్యల పరిష్కార సమయంలో సర్వే నిర్వహణ, సెటిల్మెంట్, పట్టాల జారీలో ఎదురవుతున్న సమస్యల వివరాలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలతో సంపూర్ణ నివేదిక సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల వల్ల వస్తున్న సమస్యలు, షెడ్యూల్ ఏరియా భూములు, రెవెన్యూ, అటవీ శాఖ మధ్య సమస్యలు, దేవాదాయ, వక్ఫ్ భూముల, తదితర సమస్యల సంపూర్ణ సమాచారంతో నివేదికలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు సి.హెచ్. మధు



మోహన్, హనుమా నాయక్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, పెద్దపల్లి, రామగుండం తహసిల్దార్ లు, రెవెన్యూ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

**మరింత మందికి ఉపాధి కలిగించే స్థాయికి ఎదగాలి**
**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిజామాబాద్ రీజనల్ హెడ్ శంకర్ హెంబ్రం**

మెట్ పల్లి ప్రతినిధి ఫిబ్రవరి 22(ప్రజాజ్యోతి) : మహిళలు స్వయం సమృద్ధి సాధించడంతోపాటు మరింత మందికి ఉపాధి కలిగించే స్థాయికి ఎదగాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిజాంబాద్ రీజినల్ హెడ్ శంకర్ హేంభ్రం అన్నారు.గురువారం పట్టణంలోని నరేందర్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహిళా /స్వశక్తి సంఘాల మేగా రుణ మేళా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిజామాబాద్ రీజనల్ హెడ్ శంకర్ హెంబ్రం మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివిధ శాఖల తరపున మహిళా సంఘాలకు ఈరోజు 8 కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు తమ కాళ్ల మీద నిలబడుతూ ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా మరికొంత మందికి ఉపాధి



కల్పించే స్థాయికి ఎదగాలని ఆయన సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివిధ బ్రాంచిల ద్వారా అనేక రకమైన పథకాలు, రుణాలు అందిస్తున్నామన్నారు. వాటిని అందిపుచ్చుకొని ఆర్థికంగా వృద్ధి సాధించాలని ఇందుకోసం తమకు నచ్చిన రంగంలో, అనుభవం ఉన్న రంగాల్లో బ్యాంకులు అందించే రుణ సదుపాయాలను పొంది యూనిట్లు ప్రారంభించి ఇతరులు అభినందించేలా, స్ఫూర్తిని పొందేలా కార్యచరణ రూపొందించు కోవడమే కాకుండా తగిన కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ లావాదేవీల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. మహిళా సంఘాల సభ్యులు రుణాలు తీసుకుని తిరిగి చెల్లించే విషయంలో రాష్ట్రం లోనే అగ్రస్థానంలో ఉండడం సంతోషకరమని, జిల్లా పరిధి లోని వివిధ మహిళా సంఘాల సభ్యుల ద్వారా నడపబడుతున్న వ్యాపార, వాణిజ్య సంస్థలు విజయ పథంలో పనిచేస్తున్న తీరుని వివరిస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ శివ కోటయ్య, మెప్మా ఏఓ శ్రీనివాస్, పి ఆర్ డి ఓ సంపత్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు ఇబ్రహీంపట్నం మేనేజర్ దిలీప్ మల్లాపూర్ మేనేజర్ రాజు,. ఇటిక్యాల మేనేజర్ రవి కమ్మరిపల్లి మేనేజర్ శ్రీనివాస్ లతో పాటు మెప్మా సిబ్బంది వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.



## ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ ను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

మంథని, ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి )ఇటీవల కారు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ ను మంత్రి శ్రీధర్ బాబు యశోద హాస్పిటల్‌లో కలిసి పరామర్శించారు. అలాగే వైద్యులతో మాట్లాడి, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, అనుచరులు ధైర్యంగా ఉండాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఎమ్మెల్యే లక్ష్మణ్ త్వరగా కోలుకోవాలని, ప్రజా జీవితం లోకి రావాలని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు.

## ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి



కరీంనగర్, ఫిబ్రవరి 22, (ప్రజాజ్యోతి): కరీంనగర్ పట్టణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్గారి 66 వర్ధంతి వేడుకలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి తాజ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పద్మాకర్ రెడ్డి, తాజ్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ మొదటి అధ్యక్షులుగా, జవహర్ లాల్ నెహ్రూ మంత్రివర్గంలో దేశ మొదటి విద్యా శాఖ మంత్రిగా పనిచేసి విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి అభివృద్ధి చేశారని, పవిత్రమైన మక్కాలో పుట్టిన ఆజాద్ అందరికీ ఆదర్శ ప్రాయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అఖిల్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, నిహాల్ అహ్మద్, సలీముద్దీన్, షబానా మహమ్మద్, ముస్తాక్ ,ఖాజా ఖాన్, ఎండి చాంద్, విక్టర్, మహమ్మద్ మిరాజ్, ఇమ్రాన్, అష్రఫ్, బాబర్ ఇస్మాయిల్, హనీఫ్, రామిడి రాజిరెడ్డి, వంగల విద్యాసాగర్, రాచకట్ల దినకర్ ,గంగుల దిలీప్, కుంభాల రాజకుమార్, కటకం కృష్ణ, బాశెట్టి కిషన్ ,శ్రీరాముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



వీణవంక (ప్రజాజ్యోతి ఫిబ్రవరి 22) వీణవంక మండలం శ్రీరాములుపేట గ్రామానికి చెందిన కోల సంతోష్ అనే యువకుడు గత నెల రోజుల క్రితం ట్రైన్ ఏక్సిడెంట్ లో చనిపోగా అతనితో 2010 సం. 10 వ తరగతి చదువుకున్న తోటి స్నేహితులంతా కలిసి గురువారం రోజున వారి కుటుంబాన్ని పరమర్శించి, వారికి ధైర్యాన్ని ఇచ్చి, వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. ఆ కుటుంబానికి నలభై ఒక్క వేల రూ..లు ఆర్థిక సహాయంగా అందివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో అతని మిత్రులు, సదానందం,మారుతి, శంకర్,రఘు,కుమార్,ప్రసాద్ సుధాకర్, రాము, భాస్కర్,మధు తదితరులు పాల్గొన్నారు..

# శరణు శరణు రత్నాపూర్ మల్లన్న

**-కోరిన కోరికలు తీర్చే మల్లికార్జునుడు**
**-24 నుంచి స్వామి జాతర**
**-24న కల్యాణం**
**-25న రథోత్సవం**
**-26న అర్ధరాత్రి అగ్ని గుండాలు..**
**-సిద్ధమైన రత్నాపూర్ పడమటి కొండ**
**-ఏర్పాట్లు పూర్తి**





మల్లాపూర్ ఫిబ్రవరి 22 ప్రజాజ్యోతి: మల్లాపూర్ మండలంలోని రత్నాపూర్ గ్రామంలో పడమటి కొండపై కొలువుదీరిన మల్లిఖార్జున స్వామి జాతర మహోత్సవాలు ఈనెల24 నుంచి 27 వ తేదీవరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ దేవ సురేష్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 23న శుక్రవారం రాత్రి సంగెం గ్రామంలో ఊరేగింపుగా స్వామివారు బయలుదేరి రత్నాపూర్ గ్రామానికి చేరుకుంటారు. గ్రామస్తులు స్వామివారికి ఘనంగా స్వాగతం పలికి రోడ్లపై పట్టువస్త్రాలు పరిచి వాటిపై పడుకోగా స్వామివారిని వారిపై నుంచి తీసుకెళ్లడం ఒక ఆచారంగా జరుగుతోంది. ఊరేగింపుగా స్వామి వారిని ఆలయానికి తీసుకెళ్తారు.24 న ఉదయం 8 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా వేదపండితుల సమక్షంలో నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు మహిళలు బోనాలతో తరలివచ్చి స్వామి వారికి సమర్పించి మొక్కులను తీర్చుకుం టారు. 25న సాయంత్రం రథోత్సవం ఆలయకమిటీ సభ్యులు కన్నుల పండువగా చేపడుతారు. 26న రాత్రి 12 గంటలకు భక్తి శ్రద్ధలతో భక్తులు అగ్నిగుండాలు నిర్వహిస్తారు. అగ్నిగుండాల అనం తరం స్వామివారికి నాగవెల్లి కార్యక్రమాన్ని జరిపిస్తారు.27న ఉదయం 6గంటలకు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించి హోమం, పూర్ణాహుతి జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. ఉదయం 10గంటలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. జాతర మహోత్సవం ముగిసిన అనంతరం స్వామి వారిని గ్రామంలోని దేవుడి ఇంటికి చేరుస్తారు..

**ఆలయ చరిత్ర..**

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మించకముందు శ్రీ మల్లిఖార్జున స్వామివారు నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం రత్నపూర్ లో పూర్వం పూజారి లింగన్న ఇంట్లో దూదిఖండెలో దర్శనమిచ్చినట్లు ఆనాటి ప్రజలు చెబుతుంటారు. ఆ రోజుల్లో పూజారి లింగన్న ఇంటినే ఆలయంగా మార్చుకుని స్వామి వారికి పూజలు జరిపిస్తూ స్వామివారి కృపకు పాత్రులవుతారు. దూదిఖండెలలో దర్శనమివ్వడంతో దూది ఖండేలా మల్లన్న స్వామి అని కూడా పిలుస్తుంటారు. నాటి నుంచి ఈనాటి వరకు మాఘమాస పౌర్ణమి నుంచి 5 రోజులు జాతర మహోత్సవాన్ని గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మించడంతో రత్నాపూర్ తో చుట్టుపక్కల ఉన్న గ్రామాలు ముంపునకు గురవుతాయని అధికారులు చెప్పడంతో మల్లిఖార్జున స్వామిని గుర్రానికి కట్టి వదిలిపెట్టారు. ఆ గుర్రం మల్లాపూర్ మండలానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పడమటి దిశగా ఉన్న కొండపై తూర్పు దిశ వైపు నిలబడి ఆగడంతో అక్కడే శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. ముంపునకు గురైన రత్నాపూర్ గ్రామస్తులు కొండకు దిగువన ఉన్న ఖాళీ స్థలంలో నూతన రత్నాపూర్ గ్రామం ఏర్పాటు చేసుకున్నారు.

**-మద్యం, మాంసం బంద్..**

స్వామివారి జాతర సమయంలో గ్రామస్తులందరూ పోచమ్మ ఆలయంలో ఏడు బోనం చేసి మొక్కులు చెల్లించుకుంటారు. మొగిలిపేట్ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి,గంగా జలాన్ని తీసుకు వచ్చి ఇంటిని శుద్ధి చేసుకుని మద్యం,మాంసం ముట్టకుండా స్వామివారిని కొలుస్తారు. స్వామివారికి కోడెలను, మేకపిల్లలను కట్టేసి మొక్కులు చెల్లిం చుకుంటారు.

**భక్తులకు అన్ని ఏర్పాట్లు..**
**-మల్లికార్జున దేవాలయ కమిటీ చైర్మన్ దేవ సురేష్**



జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాం.నిర్మల్, నిజామాబాద్,కరీంనగర్, జగిత్యాల జిల్లా ల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. వారి సౌకర్యార్థం పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశాం. తాగునీటి సమస్య, రాత్రి సమయంలో కరెంటు సమస్యలు లేకుండా ఏర్పాటు చేశాం.

**-మల్లన్న కల్యాణం తిలకించండి..**
**-ఆలయ ప్రధాన అర్చకులు కుడుకల శివకుమార్**



కమనీయం, రమణీయం మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం. ఐదు రోజులు జరిగే ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలి. కోరిన కోరికలు తీర్చే మల్లికా ర్జున స్వామికి జాతర వైభవంగా నిర్వహిస్తాం. స్వామివారి కల్యాణానికి తరలిరండి.

## డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టొద్దు

**అధికారులు సమస్యలు పరిష్కరించాలి**
**కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్**



కరీంనగర్, ఫిబ్రవరి 22, (ప్రజాజ్యోతి): ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణుగారి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ కరీంనగర్ జిల్లా పరిషత్తు చైర్మన్ తుల ఉమను పెద్దలింగాపూర్ డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు గురువారం కలిసి డబుల్ బెడ్ రూమ్ సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టొద్దని, అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు కరెంటు, నీటి సరఫరా చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులతో మాట్లాడి లబ్ధిదారుల సమస్య పరిష్కరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ తో మాట్లాడి సమస్య పరిష్కారం చేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇల్లంతకుంట మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామానికి చెందిన 40 మంది లబ్ధిదారులకు అప్పటి తహశీల్దార్ గ్రామసభ ద్వారా 40 మంది నిరుపేద ఇళ్లులేని లబ్ధిదారులను ఎంపిక చేసి, డబుల్ బెడ్ కేటాయించడం జరిగిందని గుర్తుచేశారు. లబ్ధిదారులు ఇళ్లలోకి పోయాక ప్రస్తుతం నీళ్లు, కరెంటు లేకుండా ఇబ్బందులు కలిగేలా చేయడం సరికాదని అన్నారు. పెద్దలింగాపూర్ డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల్లో 90శాతం నిరుపేద దళితులే ఉన్నారని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఉంటున్న లబ్ధిదారులకు కరెంటు, నీళ్లు ఇవ్వకుండా ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారో అధికారులను స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అడిగి సమస్య పరిష్కారం చేయాలని పేర్కొన్నారు. లబ్ధిదారులకు నీళ్లు, కరెంటు సరఫరా విషయంలో అధికారులను అడిగితే ఎమ్మెల్యేని అడగండి అంటూ లబ్ధిదారులకు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమేంటని అన్నారు. రాజకీయాల్లో పదవులు రావడం, పోవడం సహజమని, కానీ అర్హులైన లబ్ధిదారులకు ఇల్లు కేటాయిస్తే, వారి సమస్యలు తీర్చడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి జిల్లా కలెక్టర్ తో మాట్లాడి, వెంటనే సమస్యను పరిష్కారం చేయాలని సూచించారు.



## సమ్మక్క-సారక్కలకు మాజీ ఎంపీ వినోద్ కుమార్ మొక్కులు

కరీంనగర్, ఫిబ్రవరి 22, (ప్రజాజ్యోతి): ఇల్లంతకుంట మండల కేంద్రంలో సమ్మక్క–సారక్క జాతర ఉత్సవాలకు గురువారం కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కరీంనగర్ మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమతో కలిసి హాజరయ్యారు. అమ్మవార్లకు మొక్కులు సమర్పించారు. జాతర ఉత్సవాలకు వచ్చే భక్తుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన త్రాగునీటి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, వైస్ ఎంపీపీ సుదగోని శ్రీనాథ్ గౌడ్, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి, కోఆప్షన్ సభ్యుడు సలీం,గజ్జెల రాజశేఖర్, జక్కుల నాగరాజు యాదవ్, ఎంద్ర చందన్, అంతగిరి అశోక్, అంతగిరి భాస్కర్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

**జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్**

పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజా జ్యోతి ), ఫిబ్రవరి 22: తెలంగాణ పారా మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ కు సంబంధించిన నూతన సంవత్సర 2024 క్యాలెండర్ ను జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ రెడ్డి మధుకర్ రెడ్డి తెలంగాణ పారా మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి దేవ్ సింగ్ కార్యదర్శి ప్రకాష్ రావు జయకర్ సువార్త డిపిఎమ్ఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజులలో కుష్టు వ్యాధిని సమూలంగా నిర్మూలించడానికి కృషి చేయాలని సూచించారు.





## యాదవ్ సంఘం అద్వర్యంలో శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ నిర్మాణం కొరకు భూమిపూజ

**భూమి పూజలో పాల్గొన్న మోహన్ యోగి**

మెట్ పల్లి ప్రతినిధి ఫిబ్రవరి 22 ( ప్రజాజ్యోతి) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం బర్దిపూర్ గ్రామంలో యాదవ్ సంఘం సభ్యులతో కలిసి మోహన్ యోగి గురువారం ఉదయం శ్రీమల్లిఖార్జున స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. గతకొన్ని రోజుల నుండి మోహన్ యోగి చేసిన పలు అభివృద్ధి పనులు మరువలేనివని పలు గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు. అదే స్ఫూర్తిని మార్గదర్శంగా తీసుకొని గ్రామ అభివృద్ధి కొరకు ఆలయం నిర్మించడం సంతోషకరంగా ఉందని మోహన్ యోగి పేర్కొన్నారు. అనంతరం మోహన్ యోగీ మాట్లాడుతూ యాదవ సంఘం సభ్యులు ముందుకచ్చి శ్రీ మల్లిఖార్జునా స్వామి ఆలయ నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి సేవలు గ్రామం కోసం మరెన్నో చేయాలని అ భగవంతుణ్ణి కోరుకుంటున్ననాని మోహన్ యోగీ మనోగతాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు ముత్యాల పెద్ద మల్లేష్, ముత్యాల నారాయణ, ముత్యాల మల్లేష్, ముత్యాల ముత్యం, ముత్యాల రామ్ లక్ష్మణ్, ముత్యాల దేవన్న, ముత్యాల మహేష్ ,తొగరి రాజేందర్, తొగరి రాజేశ్వర్,లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పసిపాప 'గుండె' కు ఎమ్మెల్యే సాయం

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మేడిపల్లి సత్యం**
**ప్రశంసలతో ముంచెత్తిన మండల ప్రజలు**



కొడిమ్యాల,ఫిబ్రవరి 22,(ప్రజాజ్యోతి):ఇచ్చిన మాట ప్రకారం చిన్నారి గుండె ఆపరేషన్ కు ఆర్థిక సాయం అందించి నేనున్నానంటూ మానవత్వం చాటాడు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన చిలివేరి నరేశ్ శరణ్య దంపతులకు నాలుగు నెలల పాప పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం విదితమే.కొద్ది రోజుల క్రితం చిన్నారి ఆపరేషన్ నిమిత్తం ఆర్థిక సాయం ఇస్తానని మాట ఇచ్చిన నేపథ్యంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దంపతులు గురువారం స్వయంగా చిన్నారి ఇంటికి వెళ్లి పాప తల్లి తండ్రులకు ధైర్యం చెప్పి తన వంతుగా లక్ష రూపాయలు సహాయం అందించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.ఈ సందర్భంగా ఆపరేషన్ పూర్తయ్యే వరకు దగ్గరుండి చూసుకుంటానని హామీ ఇచ్చారు.దీంతో మండల ప్రజలు ఎమ్మెల్యేను ప్రశంశలతో ముంచెత్తారు.ఈ కార్యక్రమంలో పీసిసి సెక్రటరీ గోగూరి మహిపాల్ రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలివేరి నారాయణ గౌడ్,మాజీ డైరెక్టర్ గుడి మల్లికార్జున్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు గడ్డం జీవన్ రెడ్డి యంపిటిసి సభ్యురాలు జమల్పూరి రాజేశ్వరి రాజేందర్, నాయకులు కొండూరి రాజు,కంచర్ల రవి,జితేందర్ రెడ్డి,పాశపు కిషన్ రెడ్డి,మారుపాక రాజు,మంద శ్రీను,సురేందర్ రెడ్డి,సాయి,రంజిత్, కళ్యాణ్,సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# పంజాబ్ రైతులపై హర్యానా పోలీసుల కాల్పులను ఖండించాలి

**కాల్పులకు పాల్పడ్డ పోలీసులను తొలగించాలి**
**జిల్లా సీపీఐ కార్యదర్శి గుంటి వేణు**



సిరిసిల్ల, ఫిబ్రవరి 22, (ప్రజాజ్యోతి): హర్యానా, పంజాబ్ రాష్ట్రాల సరిహద్దుల్లో హర్యానాకు చెందిన పోలీసులు ఫాసిస్టు హంతక స్వభావంతో అత్యంత కర్కశంగా జరిపిన కాల్పుల్లో పంజాబ్ రాష్ట్రానికి చెందిన బటిండా జిల్లాలోని బాలన్ గ్రామానికి చెందిన 24 సంవత్సరాల యువకుడు శుభకరన్ సింగ్ మరణించిన సంఘటన దురదృష్టమని జిల్లా సీపీఐ పార్టీ కార్యదర్శి గుంటి వేణు అన్నారు. జిల్లా సీపిఐ పార్టీ కార్యాలయంలో అయన మీడియాతో మాట్లాడుతూ బరితెగించి కాల్పులకు తెగబడిన సంబంధిత హర్యానా పోలీసులను వెంటనే హత్యా నేరం కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కాల్పుల సంఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత సమగ్ర విచారణ జరిపించాలని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులు పండించిన (పంటకు ఎంఎస్పి) పంటలన్నింటికీ కనీస మద్దతు ధర ఉత్పత్తి వ్యయంపై ఒకటిన్నర రేట్లు చెల్లించాలని, రుణ విమోచన చట్టం తీసుకురావాలని, విద్యుత్ సవరణ బిల్లు ద్వారా విద్యుత్తు రంగ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, కౌలు రైతులకు తగిన రక్షణ కల్పించాలని, మూడు వ్యవసాయ సాగు చట్టాలను బేసిక్ గా ఉపసంహరించుకోవాలన్నారు. ఢిల్లీ కేంద్రంగా సాగిన చారిత్రాత్మకమైన రైతంగ పోరాటంలో మరణించిన 750 మంది రైతు కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై అమానుషంగా కాల్పులు చేయడం కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వ , కార్పొరేట్, మతతత్వ విధానాలకు నిదర్శనమని గుంటి వేణు పేర్కొన్నారు. ఢిల్లీ కేంద్రంగా సాగిన రైతాంగ పోరాటంతో సాగు చట్టాల ఉపసంహరణకు, రైతుల పంటలకు ఎంఎస్పి ఇస్తామన్న నరేంద్ర మోడీ రాతపూర్వక హామీని అమలు చెయ్యని కారణంగా, తిరిగి ఉద్యమ బాట పట్టిన రైతుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాల్సిన బాధ్యతను విస్మరించి, నిర్బంధం, అణిచివేత ద్వారా ఉద్యమాన్ని ఆపాలనుకోవడం ఫాసిస్ట్ ఆలోచన తప్ప వేరు కాదని అన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై హర్యానా పోలీసులు జరిపిన కాల్పులను ఖండించాల్సిందిగా ప్రజలను, ప్రజాస్వామిక వాదులను, మేధావులను గుంటి వేణు కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పంతం రవి, జిల్లా కౌన్సిల్ నాయకులు అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి, సోమ నాగరాజులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం



**ప్రశాంత వాతావరణంలో మొక్కులు చెల్లించుకోవాలి**
**జాతర కమిటీ చైర్మన్ మూగల రాజి రెడ్డి**

హుజూరాబాద్ / ప్రజాజ్యోతి : పట్టణంలోని రంగనాయకులగుట్ట సమీపంలో రెండేళ్ళకోసారి జరుగుతున్న సమ్మక్క సారలమ్మ వనదేవతల జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, ప్రశాంత వాతావరణంలో మొక్కలు చెల్లించుకోవాలని జాతర కమిటీ చైర్మన్ మూగల రాజిరెడ్డి అన్నారు. గురువారం జాతర ప్రాంగణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... జాతరను పురస్కరించుకొని బుధవారం రాత్రి సారలమ్మతల్లి గద్దెపై కొలువుదీరారని, గురువారం రాత్రి సమ్మక్కతల్లి గద్దెపై కొలువు దీరుతుందని తెలిపారు. సమ్మక్క సారలమ్మ తల్లులకు మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. క్యూ లైన్ల ద్వారా భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవాలని తెలిపారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాతర కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది, వాలంటీర్లు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విద్యుత్ దీపాలు. మంచినీటి సౌకర్యాం. వైద్య సేవలు, తదితర ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులు ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాతర కమిటీ వైస్ చైర్మన్ గాలిబు నరేష్, డైరెక్టర్లు కొలిపాక రమేష్, చురుకంటి తిరుపతి రెడ్డి, తిరుపతి, గడ్డం రాఘవేంద్ర, మిడిదొడ్డి రాజు, సుంకరి రాజేందర్, ఎర్ర నాగరాజు, శ్రీనివాస్ గౌడ్, విష్ణు, సుదర్శన్, సంపత్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



## బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

గన్నేరువరం ఫిబ్రవరి 22 ( ప్రజాజ్యోతి) : గన్నేరువరం మండల కేంద్రం కు మానేరు డ్యామ్ పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ గురువారం మానేరు బ్రిడ్జి జేఏసీ ఆధ్వర్యంలో అధ్యక్షులు సంపత్ ఉదయ్ కుమార్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం చేపడితే గన్నేరువరం మండల వాసులకు ప్రయాణ దూరం అతి చేరువ కావడంతోపాటు భారం తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి పుల్లెల రాములు, కొట్టే రవి, వెంకటేష్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**ఘన స్వాగతం పలికిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తిప్పారపు సంపత్**
**పరాయి పాలన నుండి విముక్తి పొందిన రోజు వనదేవతల అనుగ్రహంతో తెలంగాణ రాష్ట్రం**
**రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్**

సైదాపూర్, ఫిబ్రవరి22( ప్రజా జ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గంలోని వెన్నంపల్లి లో కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ దేవతలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం రోజున దర్శించుకుని,సైదాపూర్ మండల కేంద్రం లో సమ్మక్క సారక్క దేవతల దేవతలను దర్శించుకున్నారు... సమ్మక్క సారలమ్మల దర్శనానికి విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తిప్పారపు సంపత్ శాలువతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు..అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..వనదేవతల అనుగ్రహంతో నాడు పరాయి పాలన నుంచి విముక్తి లభించి తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని అన్నారు..చిలుకల గుట్ట నుండి సమ్మక్క తల్లిని గద్దెల మీదకి తీసుకొస్తున్న సమయంలోనే పార్లమెంటులో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టారని పాత రోజులు గుర్తు చేశారు.సమ్మక్క సారలమ్మ దేవతల ఆశీర్వాదంతో ఎన్నో సంవత్సరాల కల నెరవేరిందని అన్నారు.జాతరకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా బస్సులు అందుబాటులో ఉంచుతామన్నారు. తెలంగాణలోని మహిళలకు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచిత ప్రయాణం చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్ మాజీ జెడ్పిటిసి గుండారపు శ్రీనివాస్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాదెండ్ల రాజ్ కుమార్ సారాబుడ్ల రాజిరెడ్డి వివిధ శాఖల మండల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు





## కేశవపట్నంలో మొక్కు చెల్లించిన ఎమ్మెల్యే



శంకరపట్నం,ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి) మండల కేంద్రం కేశవపట్నం లో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ వన దేవతలకు శుక్రవారం మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దేవతలను దర్శించి ఆయన ఎత్తు బంగారం మొక్కును చెల్లించారు. కాగా ఆలయ పూజారులు గొడిశాల సారయ్య, జనగాం తిరుపతి, కొత్తపెల్లి రాజయ్య, తిరుపతిలో తిలకం దిద్ది, అమ్మవార్ల పసుపు, కుంకుమ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వన్ దేవతలైన సమ్మక్క సారలమ్మ దేవతలను ఈ రాష్ట్ర ప్రజలు పాడిపంటలు, ఆయురారోగ్యాలు, సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపగోని బసవయ్య గౌడ్, టిపిసిసి మెంబర్, మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల మండల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్ఎంపీ పీఎంపీల సేవలను గుర్తించి - శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్ అందజేస్తాం

**ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి**

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిని ఆర్ఎంపి పిఎంపీల నూతన కార్యవర్గం కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్ఎంపీలు పీఎంపీలు అత్యవసర సమయాల్లో ప్రాథమిక చికిత్స అందిస్తూ ఎంతో సేవ చేస్తున్నారన్నారు. కరోనా కాలంలో ప్రజలకు గ్రామీణ ప్రాంత ఆర్ఎంపి పిఎంపీలు ప్రజలకు చికిత్సకు అవసరమైన సలహాలు సూచనలు అందించి మనోధైర్యం కల్పించారని వారి సేవలను కొనియాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆర్ఎంపీ పీఎంపీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేసి గుర్తింపు కార్డులు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వైద్యశాఖ మంత్రి దృష్టికి ఆర్ఎంపి పి.ఎం.పిల సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## ఎరువుల విక్రయ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**జిల్లా వ్యవసాయ అధికారిని వాణి**



జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి): జగిత్యాల జిల్లాలో నిబంధనలు అతిక్రమించి ఎరువుల విక్రయాలు జరిపితే వారిపై చర్యలు తప్పవని జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారిణి బి. వాణి హెచ్చరించారు. జగిత్యాల అర్బన్ మండల కేంద్రంలో ఏ.ఆర్.ఎస్.కె వివిధ దుకాణాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దుకణాలలో స్టాక్ బోర్డు ఏర్పాటు చేసి ఎరువుల క్రయ విక్రయాల వివరాలు నమోదు చేయాలన్నారు. లైసెన్స్ కాఫీలను విక్రయ కేంద్రాలలో ప్రదర్శనగా గోడకు పోస్టర్లను అమర్చాలని విక్రయించే ఎరువులకు సంబందించిన (ఓ.ఫామ్)లను తమ లైసెన్స్ లో నమోదు చేసుకోవాలని ఆమే సూచించారు. ధరల పట్టిక ప్రతి రైతుకి కనిపించే విధంగా అమర్చడంతో పాటు ప్రతి రోజు ఎరువుల నిల్వలను రోజు వారి అమ్మకాలను రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు మించి ఎరువులను అమ్మరాదని రైతులకు కొనుగోలు రశీదును ఫామ్ .ఎం రూపకంగా ఇవ్వాలని ఎరువుల అమ్మకాలను ఈ.పాస్ బయోమెట్రిక్ పద్ధతిన విక్రయాలు జరపాలని వాణి దుకాణధారులకు సూచించారు. ప్రతి నెలలో క్రయ విక్రయాల వివరాలు జిల్లా కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యసాయాధికారిని వినీల వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవు మల్లాపూర్ ఎస్ ఐ కిరణ్ కుమార్

మల్లాపూర్ ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి) : అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మల్లాపూర్ ఎస్ ఐ కిరణ్ కుమార్ పేర్కొన్నారు.ఈ మేరకు బుధవారం రాత్రి 8 గంటలకి పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో మల్లాపూర్ మండలంలోని సిరిపూర్ గ్రామ శివారులో అనుమానాస్పదంగా బులోరా వాహనం కనబడగా అట్టి వాహనాన్ని ఆపి చూడగా అందులో అక్రమంగా 15 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం తరలిస్తున్నట్లు తెలిసింది వెంటనే పోలీసులు పట్టుకున్నారు. అట్టి పిడిఎస్ బియ్యాన్ని పట్టుకుని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

# కొలువు దీరిన సమ్మక్క

**తరలివచ్చిన వేలాది మంది భక్తులు**



సుల్తానాబాద్, (ప్రజాజ్యోతి) ఫిబ్రవరి 22: మండలంలోని నీరుకుల్లా వేగురవల్లి సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా గురువారం సమ్మక్కను పావురాల గుట్ట నుండి భక్తిశ్రద్ధలతో కోయ పూజార్ల కోలాహలం తో సమ్మక్కను గద్దెకు తీసుకువచ్చారు. భక్తుల పూనకాలతో సమ్మక్క సారలమ్మ జాతర మారు మోగింది .వేలాది మంది భక్తులు అమ్మవారికి బంగారాన్ని సమర్పించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే నేరుకుల్లా వేగురుపల్లి సమ్మక్క సారలమ్మ జాతర భక్తులతో కిటకిటలాడింది. మేడారం కొంగు బంగారమైన రెండవ మేడారం గా ప్రసిద్ధి చెందిన నీరుకుల్లా వేగురుపల్లి సమ్మక్క సారలమ్మ జాతర అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు సాంప్రదాయాలతో వెళ్లి తమ యొక్క మొక్కులను చెల్లించుకుని అమ్మవారికి కోరుకున్నది జరగాలని మొక్కుకున్నారు. సమ్మక్క సారలమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ జగదీష్ ఎస్సై విజయేందర్ ఆధ్వర్యంలోని పోలీసులు భారీ బందోబస్తు నిర్వ



హించారు. శ్రీవాణి కళాశాల విద్యార్థిని విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలను ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క సారలమ్మ జాతర చైర్మన్ చర్లపల్లి నరసయ్య గౌడ్ డైరెక్టర్లు రాజు వీరస్వామి కాంగ్రెస్ పార్టీ నాయకులు కోటగిరి రమేష్ గౌడ్ దాసరి సతీష్ గౌడ్ పొన్నం చంద్రయ్య గౌడ్ తో పాటు మాజీ సర్పంచ్ బోయిని రాజ మల్లయ్య మాజీ సమ్మక్క సారలమ్మ జాతర చైర్మన్ పొన్నం సంపత్ గౌడ్ తో పాటు ప్రజా ప్రతినిధులు ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# సమ్మక్క సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు

**ఎంపీటీసీ సభ్యులు మండల రమేష్, కమిటీ చైర్మన్ మూల హరీష్ గౌడ్**



సుల్తానాబాద్, ,(ప్రజా), ఫిబ్రవరి 22: మండలంలోని నారాయణపూర్ సమ్మక్క సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేశామని కమిటీ చైర్మన్ మూల హరీష్ గౌడ్ ఎంపిటిసి సభ్యులు మండల రమేష్ పేర్కొన్నారు గురువారం నారాయణపూర్ సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కలు తీర్చుకున్నారు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామరావు తో పాటు ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు కొదురుపాక మాజీ సర్పంచ్ దేవరనేని సాగర్ రావు మాజీ ఎంపీటీసీ సభ్యులు చంద్రమౌళి మాజీ ఉప సర్పంచ్ రామారావు తో పాటు అన్నమనేని వేణుగోపాలరావు అన్నమనేని రఘుపతిరావు తదితరులు పాల్గొన్నారు మండలంలోని గర్రెపల్లి గ్రామంలో సమ్మక్కను గద్దపై తీసుకువచ్చి మొక్కలు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ చైర్మన్ బొల్లం లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాజీ సింగిల్విండో చైర్మన్ కల్లేపల్లి జానీ మాజీ సర్పంచులు పడాల అజయ్ గౌడ్ వీరగోని సుజాత రమేష్ గౌడ్ తో పాటు మాజీ ఉపసర్పంచ్ మధు కార్యదర్శిలు ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు



## కేశవపట్నంలో గద్దెకు చేరిన సమ్మక్క తల్లి

శంకరపట్నం, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి) మండల కేంద్రం కేశవపట్నంలో జరుగుతున్న శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని వెంకయ్య గుట్ట నుండి పూజారి గౌడిశాల సారయ్య, సహ పూజారులు జనగాం తిరుపతి, కొత్తపెల్లి రాజయ్య, తిరుపతి, గోడిశాల శ్రీనివాస్ లు సమ్మక్క తల్లిని గద్దెకు చేర్చి ప్రతిష్టించారు. పూజారులతో పాటుగా ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, స్థానిక నాయకులు వెంట ఉన్నారు. అనంతరం భక్తుల మొక్కుల సమర్పణ ప్రారంభమయ్యాయి. రేపు సాయంత్రం శ్రీ సమ్మక్క, సారలమ్మలు తిరిగి వనప్రవేశం జరుగుతుందని, భక్తుల సౌకర్యార్థం సకల వసతులు సమకూర్చబడ్డాయని ఉత్సవ కమిటీ చైర్మన్ గుర్రం స్వామి, ఆలయ ఈవో డివి. మారుతీ రావులు తెలిపారు.

# మత్స్యగిరీంద్ర స్వామిని దర్శించుకున్న మంత్రి, ఎమ్మెల్యే



శంకరపట్నం, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి) మండల పరిధిలోని కొత్తగట్టు గ్రామంలోని మత్స్య గిరింద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ లు మత్స్య గిరింద్ర స్వామిని దర్శించుకున్నారు. కాగా ఆలయానికి వచ్చిన మంత్రి, ఎమ్మెల్యేలకు ఆలయ పూజారులు మురళీధర చార్యులు, మాధవాచార్యులు ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, ప్రత్యేకంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారులు స్వామి వారి ఆశీస్సులతో పాటు తీర్థ ప్రసాదాల అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి, టిపిసిసి మెంబర్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అధ్యక్షుడు మోరంపల్లి రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి నాంపల్లి తిరుపతి, బండారి తిరుపతి, కళ్ళపెల్లి రాజయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి హిస్సాముద్దీన్, మండల ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు ఎండి అయాన్, స్థానిక వార్డు మెంబర్ పూరెల్ల ప్రశాంత్, నాంపల్లి వీరస్వామి, బాడిశ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మోత్కుల నారాయణ గౌడ్ కు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పురస్కారం



సిరిసిల్ల టౌన్: ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి) రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని బద్దెనపల్లి గ్రామానికి చెందిన విద్యావేత్త, తెలుగు పోటీ పరీక్షల నిపుణులు, కవి ,రచయిత, విమర్శకులు డాక్టర్ మోతుకులనారాయణ గౌడ్ కు సంగారెడ్డి జిల్లాకు చెందిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విశిష్ట పురస్కారం 2024 పొందారు. ఇట్టి పురస్కారాన్ని సంగారెడ్డి జిల్లాలో సెయింట్ ఆంథోనీ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన పురస్కార ప్రదాన కార్యక్రమంలో అందుకున్నారు.తెలంగాణ సాహిత్యం గౌడుల వృత్తి జీవన చిత్రణ అనే పరిశోధనా అంశంపై డాక్టర్ నందిని సిద్ధారెడ్డి పర్యవేక్షణలో పిహెచ్డి చేసారు.దీనికిగాను ఈ పురస్కారాన్ని నారాయణను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ విశిష్ట పురస్కారం పొందడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కవులు, రచయితలు, వివిధ సాహితీసంస్థల ప్రతినిధులు, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గోపా సభ్యులందరూ, ఈదు గౌడ సంఘాల ప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు డాక్టర్ మోత్కుల నారాయణ గౌడ్ అభినందించారు.

# జాతరలో మినరల్ వాటర్ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**భక్తుల దాహార్తికి సంజీవని ట్రస్ట్ సమర్పణ**

శంకరపట్నం, ఫిబ్రవరి 22(ప్రజాజ్యోతి) మండల కేంద్రంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తుల దాహార్తిని తీర్చడానికి కరీంనగర్ సవరణ్ స్ట్రీట్ కు చెందిన సంజీవన్ ట్రస్ట్ వారు అందజేస్తున్న శీతల మినరల్ వాటర్ సరఫరా కేంద్రాన్ని శుక్రవారం మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఎం. విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మావురపు రాజకుమార్, తిమ్మాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరంపల్లి రమణారెడ్డి, పోలంపల్లి ఎంపీటీసీ బండారి రమేష్, మాజీ పీఏసీ చైర్మన్ బుడిగ కొండయ్య, గుంటి మల్లేశం, ఆశిక్ పాషా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపగాని బసవయ్య గౌడ్, టి పి సి సి మెంబర్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ స్థానిక నాయకులు బొంగోని తిరుపతి గౌడ్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, గుర్రం, వెంకటేశం గౌడ్ పూరెల్ల ప్రశాంత్, బొంగోని శ్రావణ్, ఎంపీడివో శ్రీవాణి, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.





## వ్యాసరచన పోటీల్లో విద్యార్థులకు బహుమతుల ప్రధానం

మెట్ పల్లి ప్రతినిధి ఫిబ్రవరి 22 ( ప్రజాజ్యోతి ) : వ్యాసరచనాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని మెట్ పల్లి ఆర్డీవో ఎన్. శ్రీనివాస్ అన్నారు. సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల బహుమతుల ప్రధాన కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్య, వైద్య రంగాల్లో సత్యసాయి సేవలు వెల కట్టలేనివి అని ఆయన అభివర్ణించారు. అనంతరం జిల్లాస్థాయిలో వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంశ పత్రాలు, మెమొంటో లు ప్రధానం చేశారు. అనంతరం ఆర్డీవోకి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు ర్యాగాల్ల ఎలయేశ్వర్, బాస శ్రీనివాస్, వివిధ కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆకస్మికంగా పోలీస్ స్టేషన్ ని తనిఖీ చేసిన డిఎస్పి



మల్లాపూర్ ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి) : మల్లాపూర్ మండల పోలీస్ స్టేషన్ ని గురువారం మెట్ పల్లి డి.ఎస్.పి ఉమా మహేశ్వర్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డులను అలాగే పరిసరాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ మేరకు డిఎస్పి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కి ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలకి తగు సూచనలు ఇస్తూ క్రైమ్ రేట్ ని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట మెట్ పల్లి సీఐ లక్ష్మీనారాయణ ఉన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

**ఇబ్రహీంపట్నం ఎస్సై ఏ.అనిల్**



జగిత్యాల క్రైమ్ (ఇబ్రహీంపట్నం) , ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడిపిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఇబ్రహీం పట్నం ఎస్సై ఏ.అనిల్ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని అమ్మకపేట శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపించేవారు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహన చోదకులు వాహనాలు నడిపించేటప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి వాహనాలను నడపాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ వాహనాల తనిఖీల్లో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

**అదనపు కలెక్టర్ పూజారి గౌతమి**



సిరిసిల్ల, ఫిబ్రవరి 22, (ప్రజాజ్యోతి): రానున్న వేసవిలో మున్సిపాలిటీల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులపై హైదరాబాద్ సీడీఎంఏ నుంచి డైరెక్టర్ దివ్య దేవరాజన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థలు), మున్సిపల్ కమీషనర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా తాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించామని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి తెలిపారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. జిల్లాలోని ఆయా బల్దియాల పరిధిలో ప్రస్తుతం ఎక్కడా తాగునీరు సమస్య లేదని ఆమె స్పష్టం చేశారు. మున్సిపాలిటీ ల పరిధిలో ఎక్కడా తాగునీరు సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ట్యాంక్ ల నుంచి ప్రతీ ఇంటికి నీరు సరఫరా లో ఏమైనా లోపాలు ఉన్నాయో పరిశీలించాలని సూచించారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. బల్దియాల పరిధిలో చివరి గృహాలు, పైప్ లైన్ లేని, గుడారాలు వేసుకొని ఉండేవారికి కూడా నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బస్ స్టాండ్, మార్కెట్, ఇతర రద్దీ ప్రాంతాల్లో తాగునీటి వసతి కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వడదెబ్బ నియంత్రణ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్దంగా పెట్టుకోవాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు నిత్యం చేయించాలని, ప్రతీ ఇంటి నుంచి చెత్తను ట్రాక్టర్లలో సేకరించాలని వివరించారు. మున్సిపాలిటీల ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని డైరెక్టర్ దివ్య దేవరాజన్ ఆదేశించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీళ్ళు పోసి కాపాడాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్, ఆయిల్ ఇండస్ట్రీలు ఉంటే జాగ్రత్తలు తీసుకునేలా అగ్ని మాపక శాఖ అధికారులతో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించాలని తెలిపారు. పబ్లిక్ పార్క్ లలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని వివరించారు. పక్షుల కోసం నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల, మున్సిపల్ కమీషనర్ లావణ్య, డిఈ ప్రసాద్ ఏఈ వెంకటేష్ ఆర్ వో రాజిరెడ్డి వేములవాడ కమిషనర్ అన్వేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మొక్కులు చెల్లించుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే

**నియోజకవర్గంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి**
**అమ్మవార్లకు నిలువెత్తు బుట్ట బంగారం సమర్పణ**
**పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**



పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజా జ్యోతి), ఫిబ్రవరి 22: పెద్దపల్లి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామరావు దర్శించుకొని తన ఎత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.గురువారం పెద్దపల్లి నియోజకవర్గంలోని సుల్తానాబాద్ మండలం, గర్రెపల్లి గ్రామంలో, నారాయణపూర్ గ్రామంలో , ఎలిగేడు మండలం కేంద్రంలో మరియు లాలపల్లి గ్రామాలలో జరుగుతున్న సమ్మక్క సారళమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవం సందర్భంగా ఆలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని , రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని ఆ అమ్మవార్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క సారలమ్మ జాతరలో విశాఖ ఇండస్ట్రీస్ ఎం.డీ గడ్డం వంశీ, ఆలయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతటి అన్నయ్య గౌడ్,మినుపల ప్రకాష్ రావు, దన్నయక దామోదర్ రావు, చిలుక సతీష్, సాయిరి మహేందర్,సమా రాజేశ్వర్ రెడ్డి, దుగ్యాల సంతోష్ రావు, కల్లేపల్లి జానీ, పులి అనూష వెంకటేష్, వెంకటేశ్వర్ రావు,బూర్ల సింధూజ సత్యనారాయణ, సింగ్గిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వెగిలం అబ్బాయ్య గౌడ్,మందల రమేష్, సాగర్ రావు, కొండల్ రావు, రామచందర్ రెడ్డి, గర్రెపల్లి చక్రధర్, వెంకటరమణ రావు, రంగు శ్రీనివాస్, అమ్ముల రమేష్, శ్రీనివాస్ మరియు గ్రామాల ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల, గురువుల ఆశయాలను నెరవేర్చాలి

**పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాసులు ఐపిఎస్**

పెద్దపల్లి ప్రతినిధి, (ప్రజా జ్యోతి), ఫిబ్రవరి 22:క్రమశిక్షణతో శిక్షణ పొంది వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత మైన స్థాయికి చేరి తల్లిదండ్రుల, గురువుల యొక్క ఆశయాలను నెరవేర్చాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాసులు ఐపిఎస్., అన్నారు. గురువారం గుడిపేట 13వ బెటాలియన్ లో స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ కు నిర్వహించిన బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కు సిపి ముఖ్య అతిథిగా హాజరై ట్రైనింగ్ ను ప్రారంభించారు. అనంతరం సిపి మాట్లాడుతూ... స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ను ప్రారంభించినందుకు సంతోషంగా ఉందన్నారు. పోలీస్ నోటిఫికేషన్ వెలువడిన అనంతరం పోలీస్ ఉద్యోగ ఉత్తీర్ణత సాధించడం కోసం కొన్ని లక్షల మంది నిరుద్యోగులు అహోరాత్రులు కష్టపడి చదివి ఈవెంట్స్ ప్రాక్టీస్ చేస్తారన్నారు. అందులో కొందరికే ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుందన్నారు. మీరూ అందులో ఉన్నారన్నారు. కనుక ట్రైనీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన శిక్షణా కేంద్రానికి తరలి వచ్చిన ట్రైనీ కానిస్టేబుళ్ళ ముందుగా సీపీ అభినందనలు తెలిపారు. సీపీ తన సక్సెస్ స్టోరీ ని శిక్షకులతో పంచుకున్నారు వాళ్లు కూడా తనలాగా కష్టపడి ఇక్కడే ఆగిపోకుండా ఇంకా ఉన్నత మైన స్థాయికి చేరి తమ యొక్క తల్లిదండ్రుల మరియు గురువుల యొక్క ఆశయాలను నెరవేర్చాలని శిక్షకులలో స్ఫూర్తినింపారు. ఎస్సీటీసీస్ నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రయత్నించాలని సీపీ అన్నారు. స్వీయ క్రమశిక్షణను పాటించాలి. నూతనంగా ఎంపికైన అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసుకొని పోలీసు శాఖ కు మంచి పేరు తీసుకురావాలన్నారు. పోలీస్ వృత్తి ఉన్నతమైనదని నిరంతరం ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు.ట్రైనింగ్ విజయవంతంగా పూర్తి చేసి యూనిట్ కు మంచి పేరు తీసుకురావాలన్నారు. సమర్థత, వృత్తి నైపుణ్యం, నీతి నిజాయితీ తో విధులు నిర్వర్తించాలన్నారు.అనంతరం కానిస్టేబుల్ శిక్షణకు సంబంధించిన పుస్తకాలను సిపి చేతులమీదుగా శిక్షకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాష, మంచిర్యాల ఏ. సి. పి. రత్నపురం.ప్రకాష్, అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, యూనిక్ మెడికల్ డాక్టర్ శ్రీధర్,డానియల్. ఆర్.ఐ లు మరియు ఆర్ఎస్ఐలు ఇతర అధికారులు, సిబ్బంది మరియు శిక్షకులు పాల్గొన్నారు.








## ఆరు నెలల్లో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తాం - జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఎల్ఎల్ గార్డెన్ నుండి గుట్ట రాజేశ్వర స్వామి రోడ్డుకు కలిపే లింకు రోడ్డు నిర్మాణ పనుల కోసం మున్సిపల్ అధికారులతో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ఎల్ఎల్ గార్డెన్ సమీపంలోని రోడ్డును పరిశీలించారు. జగిత్యాల పట్టణంలోని మాస్టర్ ప్లాన్లో ఆమోదించిన ఎల్ఎల్ గార్డెన్ నుండి గుట్ట రాజేశ్వర స్వామికి వెళ్లే 60 ఫీట్ల రోడ్డు వెడల్పుకు సంబంధించిన అంశాలపై స్థానిక మున్సిపల్ అధికారులతో కలిసి జీవన్ రెడ్డి సమీక్ష చేశారు. మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోతున్న వారి పరస్పర అంగీకారంతో పరిహారం చెల్లింపుతో నైనా విస్తరణ పనులు చేపడతామని అన్నారు. అంతర్గాం నుండి వచ్చే వాహనాలను మళ్లించేందుకు ఎల్ఎల్ గార్డెన్ మీదుగా స్వామి గుట్ట రోడ్డు కలిపేందుకు గతంలోనే మాస్టర్ ప్లాన్ రూపొందించుకోవడం జరిగిందని తెలిపారు. ఎల్ఎల్ గార్డెన్ నుండి గుట్ట రాజేశ్వర స్వామీ లింక్ రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేపట్టాలని అధికారులకు సూచించారు. యావర్ రోడ్డుపై ట్రాఫిక్ తగ్గించేందుకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టామని కరీంనగర్ రోడ్డు నుండి గొల్లపల్లి రోడ్డు వరకు ఇరు వైపులా డబుల్ రోడ్డు నిర్మించామన్నారు. గొల్లపల్లి రోడ్డు నుంచి రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ధర్మపురి రోడ్డులో సింగల్ రోడ్డు ఉందని బైపాస్ రోడ్డు అభివృద్ధి కోసం సెంట్రల్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద కేంద్రం 14 కోట్లు కేటాయించాలనే ప్రతిపాదనలు సీఎం రేవంత్ రెడ్డి ఆర్.అండ్.బి మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లమని తెలిపారు.

## వక్ఫ్ బోర్డు నూతన చైర్మన్ ను కలిసిన కొండూరు గాంధీ



గంభీరావుపేట ఫిబ్రవరి 22 ( ప్రజా జ్యోతి): తెలంగాణ వక్ఫ్ బోర్డు నూతన చైర్మన్ గ ఎన్నికైన సయ్యద్ అజ్మతుల్లా హుస్సే నీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండూరు గాంధీ.

# విద్యతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలి





**నలంద ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఘనంగా వీడ్కోలు వేడుక..**

**వేడుకలో పాల్గొని మాట్లాడిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గంగాసాగర్**

మెట్ పల్లి ప్రతినిధి ఫిబ్రవరి 22 ( ప్రజాజ్యోతి) : విద్యార్థిని విద్యార్థులు చక్కటి విద్యతోపాటు క్రమశిక్షణతో కలిగి ఉండాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గంగాసాగర్ అన్నారు. మెట్ పల్లి పట్టణంలోని ఎస్ ఆర్ ఎస్ పి ఫంక్షన్ హాల్ లో నలంద ఒకేషనల్ జూనియర్ కళాశాల రెండవ సంవత్సరం పూర్తిచేసుకుంటున్న విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గంగసాగర్ (వెంకటేశ్వర పిల్లల హాస్పిటల్) , మెట్ పల్లి ఎస్ ఐ చిరంజీవి పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ గంగసాగర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవితంలో లక్ష్యాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు





రాయాలని, మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు గురువులకు,కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని అనవసర విషయాల గురించి దృష్టి పెట్టకుండా జీవితంలో గొప్పగా విజయం సాధించాలని పేర్కొన్నారు. అనంతరం మాట్లాడిన మరొక ముఖ్య అతిథిగా హాజరైన మెట్ పల్లి ఎస్ ఐ చిరంజీవి మాట్లాడుతూ టీనేజ్ విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చెడు వ్యసనాలకు లోను కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు మద్యం, గంజాయి నుండి యువత దూరంగా ఉండాలి అని స్వామి వివేకానంద చెప్పినట్టు దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉంది అని ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత దేశానికి కావాలి అని యువత అందరూ సన్మార్గంలో నడవాలి అని ఎలాంటి చట్ట వ్యతిరేక చర్యలలో భాగస్వామ్యం అవ్వద్దని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని వచ్చే బోర్డ్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధిచాలని కోరారు. అనంతరం కళాశాల యాజమాన్యం ముఖ్య అతిధులుగా హాజరయిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గంగసాగర్ గారిని, మెట్ పల్లి ఎస్ ఐ చిరంజీవి లను నిర్వహకులు ఘనంగా శాలువతో సన్మానించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో పలువురిని అలరించారు.ఈ కార్యక్రమంలో కలశాల చైర్మన్ ఎండి యాసిన్ గ, ప్రిన్సిపాల్ బిస్మిల్లా , అధ్యాపకులు శ్యామల, మనోహర్,గణేష్,కిషోర్, రాజేందర్,ధనుంజయ్,, రఘు,మహేశ్వరి, శ్యామల లతో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## శివసత్తుల పూనకాల మధ్య
# గద్దెకు చేరిన సమ్మక్క దేవత

**మొదలైన భక్తుల మొక్కుల చెల్లింపు**
**డు జనసంద్రం కానున్న సమ్మక్క సారక్క జాతర**



జమ్మికుంట, ఫిబ్రవరి22( ప్రజా జ్యోతి ): ఇల్లందకుంట మండలంలోని మాల్యాల – వాగొడ్డు రామన్నపల్లి గ్రామాల ఆధ్వర్యంలో నిర్వహించే వనదేవతలు సమ్మక్క సారలమ్మ జాతర రెండవ రోజు గురువారం శివ శివసత్తుల పూనకాల మధ్య సమ్మక్క తల్లి వనం నుండి జనం లోకి కోయపూజారుల మధ్య తీసుకువచ్చారు...సమ్మక్క సారలమ్మ జాతరకి కోయ పూజారులు సారలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు కుంకుమను తీసుకొని ఊరేగింపుగా సమ్మక్క దేవతను గద్దె వద్దకు డప్పు చప్పులు, డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల అంగరంగ వైభవంగా భక్తజనం కేరింతల మధ్య సారలమ్మ దేవతను ఊరేగింపుగా గద్దెకు తీసుకుని వచ్చారు..కాకతీయ చక్రవర్తి సైన్యంతో పోరాడి వీరమరణం పొందిన సమ్మక్క సారలమ్మ లను దర్శించుకొనుటకు వచ్చిన భక్తులకు ఆ తల్లుల దర్శనం కావడంతో చెప్పలేని ఆనందం, సంతోషంతో పడిపడి దండాలు పెడుతూ, తమను చల్లంగా చూడాలితల్లి అంటూ గద్దెల ప్రాంగణానికి తమ మొక్కుబడులతో బారులు తీరిన జనంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది.. ఈ కార్యక్రమంలో శ్రీ సమ్మక్క సారలమ్మ అధ్యక్షులు గురుకుంట్ల రాజీర్,సర్పంచులు గురుకుంట్ల సాంబయ్య, పుట్ట రాజు , ఎంపిటిసి జోష్నా– శ్రీనివాస్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఉడత వీరస్వామి, మేదరి నరేందర్, వార్డు సభ్యులు తాడెం సతీష్, కళ్యాణ్, ఆకునూరి జయ –సాంబమూర్తి, తాడెం జ్యోతి –మహేందర్, ఏడేడ్ల సదయ్య,అరెల్లి తిరుపతి, గోవావర్ధన్, కొరకండ్ల శ్రీనివాస్ ,గుడికందుల సంపత్ ,మురహరి గోపాల్, తిరుపతి, మొద్దయ్య ,చిరుమళ్ళ మొగిలి, కారింగుల లక్ష్మీపతి, గొర్రె అనిల్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ

**మాజీ ఎమ్మెల్యే రవిశంకర్**

మల్యాల, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి) : రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మోసం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ అన్నారు. మల్యాల మండల కేంద్రంలోని సాయి ఫంక్షన్ హాల్ లో గురువారం బబీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎలక్షన్లలో కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలు, అసత్యపు ఆరోపణలతో అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, మళ్లీ పార్లమెంటు ఎలక్షన్లు రానున్న తరుణంలో రేవంత్ రెడ్డి తెలంగాణ నుంచి నుంచి 17 ఎంపీ స్థానాలకు 17 గెలిస్తేనే పూర్తి హామీలు నెరవేర్చుతామని మళ్లీ ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రజలకు సేవ చేస్తామని చెప్పి వచ్చి ముఖ్యమంత్రి ఢిల్లీలో



ఎమ్మెల్యేలు హైదరాబాదులో ఉంటున్నారని కరెంటు సరిగ్గా లేక పొలాలు ఎండుతున్నాయని, త్రాగే నీళ్ల కోసం బిందెలు లైన్లు ఎరువుల కోసం చెప్పులు లైన్లో పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 25 వేల ఉద్యోగాలకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేసి తామే ఉద్యోగాలు ఇచ్చినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తుందని, ఎవరికో పుట్టిన బిడ్డను తమ బిడ్డగా చెప్పుకున్నట్లు అనిపిస్తుంది అన్నారు. బిజెపి ఎంపీ బండి సంజయ్ విజయ సంకల్ప యాత్ర ఏ ఉద్దేశంతో చేస్తున్నారు ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. 5 సంవత్సరాలుగా ఎంపీగా ఉండి కొండగట్టుకు ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి మానాల లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రవిశంకర్ ను, నాయకులకు శాలువాతో సత్కరించారు. మానాల గ్రామానికి శివరాత్రి హనుమంతును రవిశంకర్ కలిసి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. మానాల గ్రామానికి చెందిన శివరాత్రి హనుమంతు దుబాయ్ లో యావ జీవ కారాగార శిక్ష పడ్డ కేటీఆర్ చొరవ చూపడంతో ఇటీవలే తిరిగి స్వగ్రామానికి చేరుకున్నాడన్నారు. లంబాడిపెల్లి మాజీ ఉపసర్పంచ్ కర్ణాకర్ రెడ్డి వివా కార్యక్రమంలో పాల్గొన్నారు. రవిశంకర్ తో జెడ్పిటిసి కొండపలకల రామ్మోహన్రావు, మాజీ సర్పంచ్ మిట్టపెల్లి సుదర్శన్,సింగిల్ విండో చైర్మన్ ఐలేని సాగర్ రావు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగం శ్రీనివాస్ మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న ఆది శ్రీనివాస్

**నూతన కమాన్ ప్రారంభించిన 'ఆది'**



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 22, (ప్రజాజ్యోతి): రాజన్న సిరిసిల్ల తంగళ్ళపల్లి మండలం ఓబులాపూర్ గ్రామంలోని శ్రీ సమ్మక్క–సారక్క జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొని, సమ్మక్క–సారలమ్మలను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇటీవల నూతనంగా నిర్మించిన కమాన్ ను సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి తో కలసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రజలందరికీ సమ్మక్క–సారలమ్మల జాతర శుభాకాంక్షలు తెలిపారు. ఆ దేవతల చల్లని దీవెనలు ప్రజలపై ఉండాలని వేడుకున్నారు.

# సమ్మక్క సారలమ్మ లకు మొక్కులు చెల్లించిన తహసిల్దార్ ,ఎంపీపీ, మాజీ ఎంపీపీ



కాల్వ శ్రీరాంపూర్ ,(ప్రజా జ్యోతి), ఫిబ్రవరి 22: కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో గల సమ్మక్క సారలమ్మ జాతరను తహసిల్దార్ జాహేద్ పాషా, ఎంపీపీ నోనేటి సంపత్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ గురువారం రోజున జాతరను సందర్శించారు. భక్తి శ్రద్దలతో మొక్కులు చెల్లించారు ,ఈ కార్యక్రమంలో సర్పంచ్ హరి సుజాత రమేష్ ఎంపీటీసీ సుంకం నిర్మలమల్లారెడ్డి రెవెన్యూ సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# వినూత్న ఆలోచనలతో విద్యార్థుల ప్రయోగాలు

సిరిసిల్ల టౌన్: ఫిబ్రవరి 22(ప్రజా జ్యోతి) సిరిసిల్ల పట్టణంలో కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల లో గత నెల రోజులుగా అటల్ టింకరింగ్ ల్యాబ్ వర్క్ షాప్ కొనసాగుతుంది. ఇన్స్ట్రక్టర్ ప్రేమ్ ఎంపిక చేసిన 52 మంది విద్యార్థులకు రోబోటిక్స్,కోడింగ్ సెన్సార్ ల వాడకం వినూత్న ఆలోచనలకు అనుగుణంగా ప్రయోగాలు చేయడం నేర్పిస్తున్నారు.స్థానికంగా విద్యార్థులు గమనించిన సమస్యలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పరిష్కారం కనుగొని ఎక్స్బిట్స్ తయారు చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు మోతీలాల్,ల్యాబ్ ఇంచార్జి శంకర్ గౌడ్, సైన్స్ టీచర్లు సరిత,శ్రీహరి,రజిత పాల్గొని విద్యార్థులకు సలహా సూచనలు చేశారు.

